



మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న విజయవాడలో నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్‌కు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. సమస్యలు పరిష్కరించమంటే నిర్బంధాలు విధిస్తారా అని నాయకులు ప్రశ్నించారు.



అభివాదం తెలియజేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు, ఎఐటియుసి, వామపక్ష నాయకులు

అంగన్వాడీల చారిత్రాత్మక విజయం

నిర్బంధాన్ని ఎదిరించి హక్కులను సాధించుకున్న అంగన్‌వాడీలకు అభినందనలు

సిఐటియు, ఎఐటియుసి, వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి హామీలను సాధించుకున్న అంగన్‌వాడీలకు అభినందనలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం కడప పాత బస్టాండ్ లో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య అధ్యక్షతన విజయోత్సవ సభ నిర్వహించారు. అంగన్‌వాడీలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి రోడ్డు ప్రమాదంలో మరణించిన సాబ్జి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మనోహర్, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడి ఉద్యోగులు 42 రోజులుగా మొక్కవోని పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని, కుయుక్తులను సైతం ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేశారని పేర్కొన్నారు. తమ కోర్కెలు సాధించుకున్నందుకు సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సంఘాలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జీతాలు పెంచడానికి అంగీకరించి అంగన్‌వాడీ సంఘాలతో ఒప్పందం చేయడం హర్షణీయమని చెప్పారు. అంగీకరించిన అంశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి క్షసాధింపులకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలని తెలిపారు. అంగన్వాడీలకు లబ్దిదారులు, ప్రజలు ప్రభుత్వ చర్యలను నిరసించి అండగా నిలబడ్డారని తెలిపారు. ఎస్మాను లెక్కచేయలేదన్నారు. కలెక్టర్లు నోటీసులిచ్చినా అంగన్‌వాడీలు బెదరలేదని పేర్కొన్నారు. ఉద్యోగాలు పీకేస్తామని, కొత్త రిక్రూట్‌మెంట్ చేసుకుంటామని నోటీసులిచ్చి, భయపెట్టి, బెదిరించినా లెక్కచేయలేదని చెప్పారు. విజయవాడ ధర్నాచౌక్ శిబిరంలో మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి చీకటిలో, మగపోలీసులతో నానా భీభత్సం సృష్టించి అరెస్టులు చేశారని తెలిపారు. 200 కిలోమీటర్ల వరకు తీసుకెళ్ళి నడిరోడ్డుపై వదిలివేశారన్నారు. చివరకు యూనియన్ అరెస్టు చేయాలని రకరకాల కుయుక్తులు పన్నారు. ఇన్నిరకాల నిర్బంధాలను, రాష్ట్ర ప్రభుత్వ కుయుక్తులను సంఘం అండతో ఉమ్మడిగా ఉద్యోగులంతా ఒక్కటై ఎదిరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యత, ఇతర సంఘాల, రంగాల కార్మికుల సంఘీభావం, ప్రజల మద్దతు అవసరమని అంగన్‌వాడీ సమ్మె తెలియజేస్తుందని చెప్పారు. నాయకులు చేతులు పైకెత్తి సంఘీభావం తెలిపారు. విజయోత్సవ సభలో సిపిఐ(యం), సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్ర శేఖర్, జి.చంద్ర, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐ.ఎన్.సుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ యూనియన్ కార్యదర్శి కళ్యా సుధాకర్ ప్రసంగించారు. సభలో ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, బిఎస్ఎన్ఎల్ సీనియర్ నాయకులు సుధాకర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్,రవి,వై కేశవ, ఏపీ మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.పవన్ కుమార్, బి.దస్తగిరి, మహిళా సంఘం నాయకురాలు భాగ్యలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు విజయ్, ఉదయ్, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



విజయోత్సవ సభకు హాజరైన అంగన్వాడీలు

పేదల భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలో వందల ఎకరాలు భూ కబ్జాదారులు బినామీ పట్టాలు పొందారని, అలాంటి పట్టాలు రద్దుచేసి పేదలు సాగు చేసుకుంటున్నా భూములకు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు మండలంలోని అక్కిమ్ గుండ్ల, కత్తెర గండ్ల, శావిసెట్టిపల్లె రెవెన్యూ గ్రామాలలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు రెడ్డికి దాదాపు 250 ఎకరాలు బినామీ పటాలతో ఆక్రమించుకున్నారని చెప్పారు. అలాగే ప్రొద్దుటూరుకు చెందిన వరదరాజు రెడ్డి బంధువులు వందల ఎకరాలు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. కడప డాక్టర్ సురేంద్ర బాబుకు దాదాపు 150 ఎకరాలు భూమి ఉందని, ఇదే మండలం బసనపల్లెకు చెందిన భూ కబ్జాదారుడైన శ్రీనివాసులకు సర్వే నంబర్ 20లో వారి బంధువులైన 32 మంది పేర్లపై వందల ఎకరాల బినామీ పట్టాలున్నాయని పేర్కొన్నారు. వీటిపై విచారణ చేసి రద్దుచేసి ఆ పొలాల్లో పేదలు, కొంతమంది సాగు చేసుకుంటున్నారని వారికి వెంటనే సాగు పారాలు కానీ, పట్టాలు కానీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు 2017వ సంవత్సరం నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూ పోరాటం చేస్తే అప్పటి కలెక్టర్ ఆరుగురు తహశీల్దార్లను ఆరు టీమ్‌లుగా వేసి విచారించారని చెప్పారు. అందుకు సంబంధించి ఫైల్ ఎక్క దాచారో బయటకు తీయాలని కోరారు. అందులో భూ కబ్జాదారుల, బినామీ పట్టాల చిట్టా ఉందని, దానిని రెవెన్యూ అధికారులు ఎందుకు తుంగలో తొక్కుతున్నారో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. ఒక వ్యక్తిపై ఐదు లేక ఆరు పట్టాలు ఎలా ఇచ్చారో, వీటిపై అధికారులు ఎందుకు విచారణ చేయలేదో జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలు ఏవైనా పొలాలు గట్టిగా అడిగితే భూ కబ్జాదారుల మాటలు విని పోలీసులు కేసులు నమోదు చేసి రౌడీషీటర్లుగా ముద్ర వేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులైన చర్యలు తీసుకుని అమగంపల్లె, ఇటుకలపాడు, శావిశెట్టిపల్లె వరికుంట్ల నాయన పల్లె ఆకుల నారాయణ పల్లె గ్రామాల్లోని పేద దళితులు సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడుతూ ప్రజా సంఘాలలో భూ పోరాటాలు చేసేవారు రౌడీషీటర్లు ఎలా అవుతారని పోలీస్ అధికారులు గమనించాలని చెప్పారు. పేదలను పదేపదే బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయటం న్యాయమైన చర్య కాదని తెలిపారు. ఏదైనా బహిరంగ విచారణ చేసి పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య గురవయ్య మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు ప్రజలు పాల్గొన్నారు



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

అసౌకర్యాలపై జడ్జి అసహనం

కడప : సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ బుధవారం కడప నగరంలోని చిన్న చౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు. పిల్లలు ఉంటున్న వసతి గదిలో ఫ్యాన్లు, లైట్లు లేకపోవడం, బాత్రూంలో నీళ్ల నిలిచి ఉండడం, పిల్లలకు సోపులు ఇవ్వకపోవడం, హాస్టల్లో హిందీ, మ్యాథ్స్ టీచర్లు లేకపోవడం, సరైన దారి లేకపోవడం వంటివి చూసి జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు తదుపరి చర్యలు కోసం వెంటనే సిఫార్సు చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసు కున్నారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్న సమయంలో వారికి అందుతున్న భోజనం సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ. మణికుమారి, వార్డెన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసరా కాదు.. టోకరా : టిడిపి

కడప అర్బన్ : ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టోకరా పెట్టారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ విమర్శించారు. నగరంలోని హరి టవర్స్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో కోటి మంది మహిళలు ఒక్కొక్కరు రూ. 20 వేలు లబ్ధి పొందారని, జగన్ రెడ్డి పాలనలో రూ. 15 వేలకు తగ్గించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షలకే కుదించి, 35 లక్షల మందికి ఈ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. మద్యం రేట్లు పెంచి, మందుబాబుల కష్టార్జితాన్ని జగన్ రెడ్డి దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత చిన్నాన్న వైఎస్ వివేక హత్య హంతకుల్ని రక్షిస్తూ, పిన్నమ్మకు ద్రోహం చేస్తున్న జగన్ రెడ్డి మహిళా ద్రోహి కాదా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చేది గోరంత, పన్నుల పేరుతో దోచుకునేది కొండంత అని విమర్శించారు. సెంటు పట్టాలో ఇండ్ల నిర్మాణం పేరుతో మహిళలను అప్పులపాలు చేసిన ఘనత జగన్ రెడ్డి దేనని తెలిపారు.

రేపు గాంధీ విగ్రహం ఎదుట నిరసన

కడప అర్బన్ : కేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై ఈనెల 26న కడప జిల్లా కేంద్రంలో ఐటిఐ సర్కిల్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని వామపక్ష రైతు సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా "క్విట్ కార్పొరేట్- దేశ్ కి బచావో" నినాదంతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐ.టి, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ పన్నులపై పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తోందని వాపోయారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామంలో ఆర్‌బికె భవనం ప్రారంభోత్సవానికి గురువారం ఉదయం 10 గంటలకు కమలాపురం ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి హాజరవుతున్నట్లు ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, డాక్రా మహిళలు విజయవంతం చేయాలని కోరారు.

కెఒఆర్‌ఎంతో 'టెక్ వేద టెక్నాలజీస్' అవగాహన ఒప్పందం

కడప అర్బన్ : కెఒఆర్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వారు టెక్ వేద టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు కరస్పాండెంట్ లిఖితారెడ్డి తెలిపారు. బుధవారం ఒప్పంద పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుతున్న వివిధ విభాగాలకు చెందిన డిప్లమా, ఇంజినీరింగ్, ఎంబిఎ, ఎంటెక్ విద్యార్థిని విద్యార్థులకు టెక్ వేద టెక్నాలజీస్ ప్రయవేట్ లిమిటెడ్ వారు ప్రస్తుత ఇండస్ట్రీస్ అనుగుణంగా నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్ట్స్, వివిధ అకాడమిక్ అవసరాలను అందజేసిందని చెప్పారు.

రోడ్డు భద్రతా చర్యలు పటిష్టం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రోడ్డు భద్రత చర్యలను పటిష్టం చేసేందుకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, ఎఎస్‌పి తుషార్ డూడీ, కమిటీ మెంబర్ కన్వీనర్, డిటిసి మీరా ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంల రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై దృష్టి సారించాలన్నారు. విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సిసి కెమెరాలను లను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మలుపుల వద్ద బ్యారికెడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించడం, లాంగ్ డ్రైవ్‌లో వచ్చే డ్రైవర్లకు అక్కడక్కడా రెస్ట్ ఏరియాలు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో . 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబందిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, డిఇ మాధవి, ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, రోడ్డు భద్రత ఎన్‌జిఒ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ విజయ్‌రామరాజు

జగన్ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదు : యుటిఎఫ్



కళ్లకు గంతలు కట్టి నిరసన తెలియజేస్తున్నయుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తున్న జగన్ సర్కార్ తగు మూల్యం చెల్లించక తప్పదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ హెచ్చరించారు. బుధవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహావీర్ సర్కిల్ నుంచి యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకుని కలెక్టరేట్ వరకు నడుస్తూ వినూత్నంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సర్కార్ కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో అన్ని రకాలుగా ఉద్యోగులను వంచించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి అంతకంటే దుర్మార్గమైన జిపిఎస్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల తమ వైఖరిని చాటుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం కూడబెట్టుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ సొమ్ములను సైతం ఉద్యోగులకు తెలియకుండానే కాజేసి ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని ఆరోపించారు. బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నా 'చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు' ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకపోతే జనవరి 31 నుంచి ఫిబ్రవరి మూడవ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎ.శ్రీనివాసులు, ఎస్.ఏజాస్ అహ్మద్, నాయకులు వి.నాగరాజు, జి.సమీర్ బాష, జి.గోపినాథ్ ఎం.చెన్నకేశవులు, ఆర్. కీర్తి కుమార్, పి కిరణ్ కుమార్,ఎం.బాబు, జి.వెంకటసుబ్బయ్య, డి.కిరణ్ కుమార్, పి.ఫయాజుద్దీన్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పక్కా ఏర్పాట్లు

కడప : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ఎస్‌పి కృష్ణారావు, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్‌తో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాగునీటిని సరఫరా, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ మధుసూదన్, డ్వామా పీడీ యదుభూషన్ రెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, బిసి కార్పొరేషన్ ఇడి డాక్టర్ బ్రహ్మయ్య, డిఇఒ రాఘవరెడ్డి, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు,సర్వ శిక్ష అభియాన్ ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప

బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలి అని, తమ హక్కులను సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన చదువులు చదివి గొప్ప పదవులు అధిరోహించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీ లక్ష్మీ అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత శాఖ, సమగ్ర బలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలందరూ తమ చదువు మీద శ్రద్ధపెట్టి చదవడం ద్వారా తల్లిదండ్రుల నమ్మకాన్ని పొందాలని చెప్పారు. కుటుంబంలో తల్లిదండ్రులు అబ్బాయి, అమ్మాయి అని వివక్షత లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలని తెలిపారు. ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్య చదువుకోవడం వల్ల మహిళా సాధికారతకు దోహదపడుతుందని తెలిపారు. పిల్లలు సోషియల్ మీడియా ద్వారా మంచిని మాత్రమే గ్రహించాలని, చెడు మార్గాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబాష్ యాదవ్ మిషన్ వాత్సల్య ద్వారా రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లలకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో పిల్లలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గురుకుల బాలికలు, సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

'అలపర్తి' కృషి ప్రశంసనీయం : విసి

కడప అర్బన్ : భారతదేశానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, అందులోని సంస్కృతి వారసత్వాన్ని రేపటి తరానికి 'పర్యాటకం' పేరుతో పుస్తకాన్ని పరిచయం చేసిన రచయిత అలపర్తి పిచ్చయ్య చౌదరి కృషి ప్రశంసనీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింత సుధాకర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్య చౌదరి రచించిన 'పర్యాటకం- రూట్స్ అండ్ ఫ్రూట్స్ ఆఫ్ టూరిజం' పుస్తకావిష్కరణ సభ ఇంటాక్ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంటాక్ కడప చాప్టర్ చైర్మన్ లయన్ కె. చిన్నపరెడ్డి, ప్రిన్సిపల్ వి. సలీం బాషా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ జి. రవీంద్రనాథ్, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పర్యాటక ప్రేమికులు, చరిత్రకారులు, మహిళా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

వల్లూరు : మండలంలోని కోట్లూరులో రైతులు సాగుచేసిన వరి పంటను కడప జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ వరి పంటలో అవసరానికి మించిన ఎరువులు వాడటం, కాంప్లెక్స్ ఎరువులు వేయడం వల్ల వరి మొక్కలు చనిపోతున్నాయన్నారు. ఇందుకు పొలంలోని నీటి పూర్తిగా తీసివేసి రెండు రోజులపాటు ఎండ పెట్టాలని అన్నారు. ప్రొపెకోనజోల్ మందు ఒక మిల్లీ లీటర్ లేదా హెక్సాకోనజల్ మందు రెండు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ రమణ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల భారం ఆపండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం వరసగా మోపుతున్న విద్యుత్ ఛార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పాత బస్టాండ్‌లో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు భారం ప్రజానీకంపై మోపారన్నారు. ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్తం చేస్తుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్‌ను ఎనిమిది వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా రూ.18 వేలకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.60 వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా రూ.1,60,000కు కొనుగోలు చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సమీక్ష చేస్తామని చెప్పారని చెప్పారు. ముఖ్యమంత్రి అయ్యాక కొనుగోలుదారులకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టన్ను బొగ్గు ధరను ఎనిమిది వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా 14 వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. సింహపురి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదానికి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల కారణంగా ప్రజానీకం పై పడుతున్న భారాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను డిమాండ్ చేశారు. రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున తాగునీటికి, రైతాంగానికి అవసరమైన సాగునీటికి ఇబ్బంది లేకుండా విద్యుత్ పంపిణీ జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అప్రకటిత విద్యుత్ కోతలను నివారించేందుకు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చదలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్. గోవిందు పాల్గొన్నారు.

28న యుఇసిడబ్ల్యూయు రాష్ట్ర 2వ మహాసభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యుఇసిడబ్ల్యూయు) రాష్ట్ర రెండవ మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పి. సి. కొండయ్య మాట్లాడుతూ ఈ మహాసభకు జాతీయ నాయకులు ఎస్.రాజేంద్రన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి. నాగేశ్వరరావు, సి. హెచ్. నరసింగరావు, రాష్ట్ర జెఎసి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కె .శ్రీనివాసులు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా సంస్థలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాచ్‌మెన్‌గా, షిఫ్టు ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారికి, నూతనంగా విధుల్లో చేరిన వారికి పాత వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిస్కం జిల్లా అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధమైన ప్రణాళిక రచన, ఉద్యమ రూపకల్పన మహాసభలో చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రియాజ్, సురేంద్ర ,శివప్రసాద్, నందీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు : ఈనెల 28వ తేదీన నెల్లూరు నగరంలో నిర్వహించే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర రెండవ మహాసభలు జయప్రదం చేయాలని బుధవారం స్థానిక మైదుకూరు రోడ్డు విద్యుత్ ఎడిఇ కార్యాలయ ఆవరణలో పస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు హుస్సేన్, మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి సి కొండయ్య, సబ్ డివిజన్ నాయకులు దస్తగిరి, ఆది, వెంకటసుబ్బయ్య, సుధాకర్, రమణ, వెంకటేష్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్బారావు, ప్రసాద్, రమణయ్య, రమణారెడ్డి, గురు ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కడప : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరమెంతైనా ఉందని మాజీ మంత్రి అహ్మదుల్లా పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ జిల్లా రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాస్ రెడ్డి బుధవారం అహ్మదుల్లా స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా వారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలాబలాలు, స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా జిల్లాలో బలం పుంజుకుని గెలుపు వైపు అడుగులు వేసేలా ప్రజలతో మమేక మయ్యే పరిస్థితుల గురించి చర్చించారు. కార్యక్రమంలో పులివెందుల నియోజ కవర్గ మైనార్టీ అధ్యక్షులు బాషా, మండల అధ్యక్షులు మహేంద్ర పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న గృహ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని హౌసింగ్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని జగనన్న మెగా లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణాల్లో స్టీల్, సిమెంట్, ఇసుక నిబంధన మేరకు నాణ్యత లోపించకుండా వాడాలన్నారు. క్యూరింగ్ బాగా చేయాలని వార్డు ఎమెనిటీ సెక్రటరీ లకు, గుత్తేదారులకు సూచించారు. పనుల్లో వేగం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య, హౌసింగ్ ఎఇ సంజీవ రాయుడు, వార్డు ఎమెనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

క్షేత్రస్థాయిలో బిసిల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

క్షేత్రస్థాయిలో బిసిల సమస్యలు పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పెద్దముడియం మండలం బిసిలతో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల నుంచి పుట్టిందన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు బిసిలకు తగిన ప్రాముఖ్యత కల్పిస్తూ వారికి చెందాల్సిన సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. బిసిల పట్ల చిత్తశుద్ధి కలిగిన పార్టీ టిడిపి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బిసిలకు రక్షణ చట్టం తెచ్చి, వారికి అన్ని విధాలాఅండగా నిలవాలని నిశ్చయించుకుందన్నారు. బిసిలు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల కొండయ్య, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, పెద్దముడియం మండలం పార్టీ బిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 కుటుంబాలు టిడిపిలో చేరిక

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్న దండ్లూరు గ్రామంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకుగ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులతో కలిసి నిర్వహించారు. ముందుగా చిన్న దండ్లూరు గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు భూపేష్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ప్రతి గడప తిరుగుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం భూపేష్‌రెడ్డి సమక్షంలో చిన్న దండ్లూరు గ్రామపంచాయతీ సర్పంచ్ చింతలపూడి రాముడు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి భూపేష్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలం ఇన్‌ఛార్జి దేవగుడి జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల పార్టీ బాధ్యులు మోహన్‌రెడ్డి, జనసేన పార్టీ మండల కో-ఆర్డినేటర్ జగదీష్ రాయల్, చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నల్లపురెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామాంజనేయులు, రాఘవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, సుధాకర్, రామాంజనేయులురెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మదూర్ రోడ్డు 7వ వార్డు సంజీవనగర్‌లో టిడిపి ఇన్‌ఛార్జి జి.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశానుసారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రవీణ్‌రెడ్డి భార్య మౌనిక, అక్క హరిత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 8 వార్డ్ మధు, పుల్లయ్య, సురసుర శ్రీనివాసులు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, కరీముల్లా, భగసింగ్ కాలనీ పట్నం మాబాషా, గోపవరం గగ్గుటూరి గౌస్ మొహిద్దీన్, కమాల్‌బాషా, ద్వారకానగర్ కిట్టు, సుధాకర్ యాదవ్, శ్రీనివాసులరెడ్డి, ఆచార్ల కాలనీ మార్తల ప్రతాపరెడ్డి, హోటల్ మధు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : బిసి వర్గాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో బిసిలంతా ఐక్యంగా పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు కోసం కృషి చేయాలని ఆ వర్గం ప్రతినిధులు పిలుపునిచ్చారు. కడప పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు మేకల బాబు అధ్యక్షతన బుధవారం ఖాజీపేటలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కడప పార్లమెంట్ టిడిపి జనరల్ సెక్రటరీ వికాస్ హరిక్రిష్ణ, రాష్ట్ర టిడిపి తొగట వీరక్షత్రియ సాధికార సమితి కన్వీనర్ చక్రధర్, రాష్ట్ర టిడిపి జంగం సాధికార సమితి కన్వీనర్ కొండపల్లి ఉమాకాంత్, మండల టిడిపి అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య, బిసి సెల్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ తుట్టె రాము యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో నంద్యాల సుబ్బయ్య, సారే రామానాయుడు, నాగేష్, దాసరి శ్రీని వాసులు, పుల్లయ్య నాయుడు, కొత్తపేట శీను, మధు, వెంకట సుబ్బయ్య, నాయబ్, రామ సుబ్బానాయుడు, బ్రహ్మ నాయుడు, శీను, బిసి నేతలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి లతారెడ్డి బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన బీటెక్ రవికి ఓటు వేయాలని లతారెడ్డి కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మారెడ్డి జోగిరెడ్డి, కొమ్మ సోమశేఖర్‌రెడ్డి, ఆకుల ప్రసాద్, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాషా, ఖాసీం వల్లి, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల వెంకటరమణ (44) ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మతునికి ముగ్గురు ఆడపిల్లలు. మంగళవారం రాత్రి నిద్రజామున ఈ ప్రమాదం జరిగిందన్నారు. చుట్టుపక్కలవారు 108సాయంతో వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి..

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలో ఈనెల 20న చింతకుంట గ్రామ సమీపం వద్ద బైకు అదుపు తప్పి గుంతలో పడి తీవ్రంగా గాయపడిన ఘటనలో.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎరికుల జీవన్‌కుమార్ (16) మృతి చెందినట్లు ఎస్‌ఐ మొయినుద్దీన్ తెలిపారు. ప్రొద్దుటూరు అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ జీవన్‌కుమార్ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బియ్యం ధరలకు రెక్కలు

నియంత్రణలో ప్రభుత్వం విఫలం.. కిలో రూ.57-రూ.60

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



ఆకాశాన్నంటుతున్న బియ్యం ధరలతో సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కిలో రూ.58 రూపాయలు ఉండడంతో బియ్యం కొనలేమని, ఆకలికేకలు తప్పడంలేదని వాపోతున్నారు. అతివృష్టి, అనావృష్టితో వరి సాగు గణనీయంగా తగ్గింది. దీంతో సన్న బియ్యం కొరత తీవ్రంగా ఉంటుందని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్న బియ్యం ధరలతో పేదలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పుడే బియ్యం ధరలు ఇలా భగ్గు మంటుంటే ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే కడుపు కాలుతోందని పలువురు చెబుతున్నారు. బియ్యం ఎగుమతులను భారత్ నిషేధించడంతో ఆ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పడిందని పలువురు పేర్కొంటున్నారు. తద్వారా బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. వివిధ కారణాల వల్ల దేశంలోనూ బియ్యం ధరలు పైకి ఎగబాకుతున్నాయి. దీంతో ప్రజలపై భారం పడుతోంది. ధరలు తగ్గించాలని బియ్యం పరిశ్రమ వ్యాపార వర్గాలకు కేంద్రం ఇటీవల ఆదేశించినట్లు సమాచారం. ఈ ఏడాది వర్షాలు ఎక్కువ పడి వరదలు రావడంతో కొన్ని ప్రాంతాల్లో వరి కొట్టుకుపోగా, మరికొన్ని ప్రాంతాల్లో పంట నీటిలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో వరి రైతులకు భారీ నష్టం వచ్చింది. అధికంగా రసాయనిక ఎరువులు వాడడం వల్ల నేల సహజ స్వభావం దెబ్బతిని పంట ఉత్పత్తి పడిపోయిందని రైతులు అభిప్రాయపడు తున్నారు. అదేవిధంగా వరి పంటకు తెగుళ్లు ఆశించి పంట పూర్తిగా రాకుండా సగం పంటనే చేతికి అందింది. సగం పంటనే చేతికి రావడంతో బియ్యం ధరలు పెరగడానికి ఓ కారణం. ఎన్నడూ లేని విధంగా పెరిగిన ఈ ధరలు సామాన్యులు, పేదలకు పెను భారమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో బస్తా (50 కిలోలు) రూ.2,800 పలుకుతోంది. ఈ లెక్కన కిలో రూ.58 రూపా యలు అవుతోంది. ప్రభుత్వాలు, అధికారులు బియ్యం ధరలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం సబ్సిడీ కింద సన్న బియ్యాన్ని పేద ప్రజలకు అందించాలని పలు వురు కోరుతున్నారు.

సన్నబియ్యంలో కల్తీలు..?

కొంతమంది వ్యాపారస్తులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేసి మిల్లుల్లో సన్న బియ్యం వడ్లు ఆడేటప్పుడు పది మూటలకు ఒకటి లేదా రెండు మూటలు అందులో కలుపుతున్నారని ఆరోపణలున్నాయి. రూ.2,800 పెట్టి సన్నబియ్యం కొనుగోలు చేసినా కల్తీనే అని వాపోతున్నారు. కొత్త బియ్యమే రూ.2,800 ఉంటే మరి పాత బియ్యం రూ.3,500 ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైస్ మిల్లులపై దాడులు నిర్వహించి కల్తీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే పేదలకు గతంలో మాదిరే ప్రభుత్వం సబ్సిడీ ధరకు సన్నబియ్యాన్ని అందించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పేదలంటే ప్రభుత్వానికి చిన్నచూపు

నేడు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎన్నికల సమయంలోనే ప్రభుత్వానికి పేదలు గుర్తుకొస్తారని, మిగిలిన సమయంలో చిన్నచూపు అని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమృత్‌నగర్‌లో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల ప్రాంతంలో ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతులు కల్పించలేదన్నారు. ఇందుకు నిరసనగా గురువారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమృత్‌నగర్‌లో కొందరు కబ్జాదారులు ముఠాగా ఏర్పడి రాజముద్రసీలుతో దొంగ పత్రాలు సృష్టించి పేదలకిచ్చిన స్థలాలను ఇతరులకు అమ్ముతూ కోట్లకు పడగ లెత్తినారన్నారు. అధికారులకు ఈ విషయం తెలిసికూడా పట్టించుకోలేదన్నారు. తమకిచ్చిన స్థలాల్లో పేదలు మౌలిక వసతులు లేకపోయినా అప్పుచేసి బేస్‌మట్టం వరకు నిర్మించుకున్నారన్నారు. ఇలాంటి స్థలాలను కూడా అధికారులు వేరే వారికి అప్పజెప్పడం అన్యాయమన్నారు. వెంటనే మౌలిక వసతులు కల్పించాలన్నారు. గురువారం నాటి నిరసన కార్యక్రమానికి బాధితులు పెద్దఎతున పాల్గొని విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను బుధవారం ఆయన స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామీణస్థాయి యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గ్రామం నుంచి ఈ పోటీలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. మండల స్థాయిలో అన్ని క్రీడలోకల రాణించిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం క్రికెట్‌లో పాల్గొనే క్రీడాకారులతో కొంతసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మైదుకూరు ఎంపిడిఒ రమణారెడ్డి, చాపాడు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ ఆటలో గెలిచిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు రావు అభినందించారు. స్థానిక బాలికల కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా ముద్దనూరు రోడ్డు సచి వాలయం తరుపున ఆడి తమ కళాశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయికి చేరారన్నారు. తమ కళాశాల సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నియోజకవర్గస్థాయి పోటీలను బుధవారం ఆర్‌డిఒ వెంకటేశు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించారు. ముందుగా స్థానిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం చైర్మన్ వరప్రసాద్ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హఫీజుల్లా, హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ పార్లపల్లి కిషోర్, కో-ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, ఎంపిడిఒలు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అస్మిత ఖేల్ పోటీలకు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు అస్మిత ఖేల్ ఇండియా సౌత్ జోన్ యోగాసనం చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. అస్మిత ఖేల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం డైరెక్టర్, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు. విద్యార్థులు యోగాసనానికి చెందిన చాంపియన్ షిప్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ షంషాద్ బేగం, ఖాన్‌బాషా, సాంస్కృతిక డ్యాన్స్ మాస్టర్ ఖాన్‌బాషా పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు, నూతన భవనాలను ప్రారంభించనున్నట్లు ఎంపిపి టిలక్షుమయ్య తెలిపారు. ఖాదర్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, సీతారామపురం గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ, చిన్న గురువలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాల ప్రారంభం, బద్రిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనం, సోమాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, వైయస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం ఉంటుందన్నారు. వైఎసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నాణ్యతతో విద్యార్థులకు భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నాణ్యతతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఎంఇఒలకు సూచించారు. పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు, పాఠశాలలోని మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం రుచికరంగా భోజనం వండాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒలు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

మసీదు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణంలోని ఉదయగిరి కాలనీలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి ఆధ్వర్యంలో బుధవారం నూతన మస్జీద్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజాద్ బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి విచ్చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పలువురు ముస్లిం మత పెద్దలు, గురువులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

త్యాగరాజు ఆలయానికి ఎంపీ రూ.2లక్షలు విరాళం

వేంపల్లె : వేంపల్లెలోని త్యాగరాజు ఆలయానికి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.2లక్షలు విరాళంగా ఇచ్చినట్లు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటరత్నం తెలిపారు. త్యాగరాజు ఆలయ అభివృద్ధికి ఎంపీ ఆర్థికసాయం చేయడం సంతోషకరమన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం తరపున ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. త్యాగరాజు ఆలయ అభివృద్ధికి మరింత సహకారం ఇస్తానని ఎంపీ హామీ ఇచ్చారని వెంకటరత్నం తెలిపారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అన్నారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు బాధితులు తమ చికిత్స నిమిత్తం అయిన ఖర్చులను ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం సిఎం సహాయనిధి నుంచి రూ. 3.5లక్షల చెక్కులను మంజూరు చేసింది. వీటిని ఎమ్మెల్సీ బుధవారం తన కార్యా లయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లా డుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. తన పాలనలో ప్రతి ఒక్కరూ ఆరో గ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో సిఎం జగన్ మొదటి నుండి పలు పథకాలు అమ లు చేస్తున్నారన్నారు. తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం అమల వుతోందన్నారు. పేదల ముంగిటికే వైద్య సిబ్బంది వెళ్లి వైద్య సేవలం దిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, నీల పాలరాముడు పాల్గొన్నారు.

ఇనామ్ భూ పట్టాలు పంపిణీ

దువ్వూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఇనామ్ భూమి పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల భూములకు ఈరోజు వారికి పట్టాలను పంపిణీ చేస్తున్నామన్నారు. దాదాపు మండలంలో 1040 ఎకరాల భూమిని 1026 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇ క్రాప్ చేసుకున్న ప్రతి రైతుకు పంట నష్టం కింద నియోజ కవర్గంలో రూ.100 కోట్లు ఇప్పటివరకు ఇచ్చా మన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, మండల కన్వీనర్ చిరాకి బాషా, దువ్వూరు సర్పంచ్ చెన్న రాయుడు, లబ్ధిదారులు పాల్గొన్నారు

కళ్లున్న కబోదులు టిడిపి నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ టిడిపి నాయకులు కళ్లున్న కబోదుల్లా మాట్లాడడం దురదృష్టకరమని 25వ వార్డు ఇన్‌ఛార్జి నూరి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.520కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జబీవుల్లా అభివృద్ధి ఏమీలేదని పత్రికా ప్రకటనలివ్వడం సమంజసం కాదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కమాల్‌బాషా, జీలాన్ పాల్గొన్నారు.



రుణమాఫీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆసరాతో మహిళలకు సాధికారత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం నాలుగో విడత వైయస్సార్ ఆసరా పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కులమతాలు, ప్రాంతాలకతీతంగా మహిళలందరికీ ఆసరా పథకాన్ని అందించిన ఘనత వైయస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జమ్మలమడుగు డ్వాక్రా మహిళలకు దాదాపు రూ.17 కోట్లు నాలుగో విడతల కింద జమ అయ్యాయని తెలిపారు. మాట ఇచ్చిన ప్రకారం డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీని చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షనేత చంద్రబాబు అబద్దాల హామీలతో ప్రజలను మోసం చేసేందుకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు అంటూ మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ సింగరయ్య, మెప్మా అధికారి గంగులయ్య, వెలుగు ఎపిఎం గురుకుమార్, ఆర్‌పిలు, యానిమేటర్లు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్టార్ క్యాంపెయిన్‌లపై సిఎం మాట్లాడడం హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

స్టార్ క్యాంపెయిన్ల గురించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ షర్మిలమ్మ, తులసిరెడ్డి, రఘువీరారెడ్డి రుద్రరాజు, శైలజానాథ్ వంటి వారు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయిన్లు కాగా గోరంట్ల మాధవ్, కొడాలి నాని వంటి వారు వైసిపి స్టార్ క్యాంపెయిన్లు అని ఎద్దేవా చేశారు. మట్టి ముంత ఇచ్చి వెండి చెంబు దొంగలించినట్లుంది జగన్ పాలన అని ఆగ్రహించారు. జగన్ ప్రభుత్వంపై రైతులు రగిలి పోతున్నట్లు, కాంట్రాక్టర్లు కసితో ఉన్నట్లు చెప్పారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి బాధితులు అందరూ కాంగ్రెస్ పార్టీ ప్రచార సారథులని తులసిరెడ్డి పేర్కొన్నారు. బాలికల పట్ల వివక్ష కారణంగా రానురాను వారి సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2013లో బంగారు తల్లి పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. దురదృష్టవశాత్తు చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాలికా సాధికారత పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే బంగారు తల్లి పథకాన్ని పునరుద్ధరించాలని తులసిరెడ్డి కోరారు.

పేదలందరికీ వైద్య సేవలందాలి

ప్రొద్దుటూరు : పేదలందరికీ వైద్యసేవలందాలని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కీర్తి (సర్జన్), డాక్టర్ హేమంత్ (చిల్డ్రన్), హిమబిందు డాక్టర్ దినేష్‌బాబు, డాక్టర్ తేజ (కంటి)వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నాగరాజు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశి భూషణ్‌రెడ్డి డాక్టర్ శివ ప్రసాదరెడ్డి, ఖాజా మోహిద్దీన్ సందర్శించి ప్రజలకు అన్ని రకాల సేవలందించాలని కోరారు. 386 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇద్దరికి కంటి కంటి అద్దాలకు రెఫర్ చేసినట్లు కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి తెలిపారు.